క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

దక్కిలి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. తీర్థంపాడు జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అదేవిధంగా తీర్థంపాడులో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజేష్, వీఆర్వో కోటిరెడ్డి ఉన్నారు.

నాయీబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకుంది



మాట్లాడుతున్న వినోద్‌కుమార్‌రెడ్డి

కోట: నాయీబ్రాహ్మణులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుందని, మీరంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మద్దతు తెలపాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం కోటలోని ఆయన నివాసంలో కోట పంచాయతీ పరిధిలోని నాయీబ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులకు తగిన గుర్తింపు తీసుకొచ్చింది జగనన్న ప్రభుత్వమేనన్నారు. కోటలో నాయీబ్రాహ్మణులకు ప్రత్యేకంగా సామాజిక భవనం కావాలని వారు కోరడంతో జగనన్న ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థలం మంజూరు చేయించి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే మా మద్దతని ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, ఉపసర్పంచ్ గాది భాస్కర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



సభ్యులకు సూచనలిస్తున్న డీపీఎం మాధవి

దక్కిలి: మహిళా సంఘాలతో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందజేస్తోందని తిరుపతి ఐబీ డీపీఎం మాధవి తెలిపారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం సాగుపై సంఘబంధ అధ్యక్షుడు, వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో ఉన్న రైతు ఉత్పత్తిదారులు సంఘం సభ్యులకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. ఏరియా కోఆర్డినేటర్ ఆదినారాయణ, సీసీలు రమేష్, వెంకటేశ్వర్లు, సునీల, రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయంఎంటీ సుహర్షలత పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరిరూరల్: రైతులు నిమ్మ సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిమ్మ రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటల సాగులో మెలకువలు పాటించాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు కరుణశ్రీ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపాల్, విజయశ్రీ, నాగార్జునరెడ్డి, డాక్టర్ రాజీవన, రైతులు, ఉద్యానవన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజకుమారి

రాపూరు: జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు రాజకుమారి అన్నారు. శానాయిపాళెంలో మంగళవారం ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదలకు ఇంటి వద్దే ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్షమన్నారు. రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. వైద్యులు హరిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, గురవయ్య పాల్గొన్నారు.

సామాన్యులే స్టార్ క్యాంపెయినర్లు

- అందుకు నిదర్శనమే అమర్‌నాథ్‌రెడ్డి
- జగనన్న గెలుపు కోసం మోటార్‌సైకిల్ యాత్ర చేస్తున్న సామాన్యుడు
- పేదవాడు గెలవాలంటే జగనన్నే గెలవాలి



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో అమర్‌నాథ్‌రెడ్డి

సూళ్లూరుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సామాన్యులే స్టార్ క్యాంపెయినర్లని, అందుకు నిదర్శనం అమర్‌నాథ్ రెడ్డే అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌రెడ్డి తన మోటార్‌సైకిల్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసుకుని రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో తిరిగి వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేస్తూ మంగళవారం సూళ్లూరుపేటకు చేరుకున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంప్ కార్యాలయానికి విచ్చేసి ఆయన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అన్నా మీరు ఇక్కడ గెలవాలి.. జగనన్న అక్కడ గెలిచి రెండోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకోవాలనే ఆకాంక్షతో మోటార్‌సైకిల్ యాత్ర చేస్తున్నానని సంజీవయ్యకు తెలియజేశారు. రాష్ట్రంలో పేదరికాన్ని తొలగించేందుకు జగనన్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని తెలిపారు. ఎన్నికలయ్యే దాకా ఈ యాత్ర కొనసాగిస్తానని చెప్పారు. అయితే టీడీపీ, జనసేన పార్టీలకు స్టార్స్ క్యాంపెయిన్ చేస్తుంటే ఒక సామాన్యుడైన నేను జగనన్నకు ఉడుత సాయం కింద ఈ యాత్రను ప్రారంభించానని, ఇంకా అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను, నాయకులను, కార్యకర్తలతో పాటు ఓటర్లను కలుసుకుని జగనన్నకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ పర్యటన కొనసాగిస్తానని చెప్పారు. తాను చేస్తున్న ఈ చిరు ప్రయత్నం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలనుంచి ఆశీస్సులు అందుతున్నాయని చెప్పారు. జగనన్న రూపంలో ఈ రాష్ట్రానికి మంచి ముఖ్యమంత్రి రావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి పేదింట్లో చిరుదీపం వెలిగినట్టయిందని చెప్పారు. ఇలాంటి మంచిచేసే ముఖ్యమంత్రి కావాలా? కరువు కాటకాలను ఆహ్వానించి, పేదవాడి నోట్లో మట్టికొట్టే చంద్రబాబు కావాలా అని ప్రజలను అడిగి తెలుసుకుంటూ ఈ యాత్రను కొనసాగిస్తానని చెప్పారు. ఏదిఏమైనా ఎవరేమన్నా 2024లో కూడా ప్రజలంగా జగనన్న వైపే వున్నారనే విషయం అర్థమవుతోందని చెప్పారు. కావున రెండోసారి జగనన్న ముఖ్యమంత్రి కావడం తథ్యం అని చెప్పారు..

అమర్‌నాథ్‌ను అభినందించిన ఎమ్మెల్యే కిలివేటి..

జగనన్న స్టార్ క్యాంపెయినర్ అమర్‌నాథ్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సాదరంగా ఆహ్వానించి అభినందించారు. నీలాంటి సామాన్యులు జగనన్నకు స్టార్ క్యాంపెయినర్లని, కొండంత అండ అని కూడా ఎమ్మెల్యే సంజీవయ్య అన్నారు. ఈ యాత్ర విజయవంతంగా 175 నియోజకవర్గాల్లో జరగాలని ఆశీర్వదించారు. మండల పార్టీ అధ్యక్షుడు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయులు చిలకా యుగంధర్‌యాదవ్ మీజూరు రామకృష్ణారెడ్డి, మెలకంటి వీరాస్వామి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సైదాపురం: ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు గాను రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వాహనాల తనిఖీ

సైదాపురం: మండల కేంద్రంలో మంగళవారం ఎన్నికల అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రూ.50వేల వరకు మాత్రమే నగదు ఉండాలని, ఆపై ఉంటే వాటికి సంబంధించిన రశీదులు తప్పనిసరిగా చూపించాలన్నారు.

54 మంది గైర్హాజర్

చిల్లకూరు: పది పరీక్షల్లో రెండవ రోజు 54 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ సనత్‌కుమార్ తెలిపారు. చిల్లకూరు, తిక్కవరం, వరగలి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పది పరీక్షలకు 549 మంది హాజరు కావాల్సి ఉంది. 54 మంది హిందీ పరీక్షకు హాజరు కాలేదని ఎంఈఓ తెలిపారు.

జగనన్న ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు



సంజీవయ్యను సత్కరిస్తున్న విజయశేఖర్‌రెడ్డి

–ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయ ప్రభంజనాన్ని ఏవరూ ఆపలేరని తిరిగి సీఎం కావడం ఖాయం అంటూ సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి వేణుంబాక విజయశేఖర్‌రెడ్డి నివాసానికి మంగళవారం వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సంజీవయ్యకు శాలువ కప్పి ఘనంగా సన్మానించి స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషిచేయాలని కోరారు. మళ్లీ సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయ కేతనం ఏగురవేసి సీఎం జగనన్నకు కానుకగా ఇచ్చేందుకు తామంతా సిద్ధం అంటూ సంజీవయ్యకు నేతలు మద్దతు తెలిపారు.

పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగ సంఘ నేతలు బిరదవాడ ముని భాస్కర్, పలు ఉద్యోగ సంఘ నేతల ఇళ్ల వద్దకు కిలివేటి సంజీవయ్య వెళ్లి తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలంటూ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, నేతలు వేణుంబాక మునుస్వామినాయుడు, పేట చంద్రా రెడ్డి, హరిరెడ్డి, ఎన్‌సీఆర్, మెస్ భాస్కర్‌రెడ్డి, బాబి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



పెదపరియ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వెంకటగిరిరూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నియమావళిపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జాయింట్ కలెక్టర్, వెంకటగిరి రిటర్నింగ్ అధికారి హెచ్‌ఎం ధ్యానచంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వివాదాస్పద పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ సమయంలో ఓటర్లకు అనువుగా కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధల మేరకు మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: ఎన్నికల నియమావళిని అధికారులు తప్పక పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఇనుగుంట, ఆర్మేనిపాడు, చిలమానుచేను, మాచవరం సచివాలయాలు, పెదపరియలో ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నియమావళిని పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. సచివాలయాల్లో సీఎం, ఎమ్మెల్యే ఫొటోలను తొలగించాలన్నారు. గ్రామాల్లో రాజకీయనేతల ఫొటోలు, ఫ్లెక్సీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వాకాడులో..

వాకాడు: మండలంలో ఎన్నికల నియమావళిని పాటించాలని తహసీల్దార్ నరసింహారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో విడి విడిగా సమావేశమయ్యారు. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, పోస్టర్లు వెంటనే తొలగించాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎస్‌ఈబీ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ పవన్‌కుమార్, ఎంఈఓ నసీం అలీ, ఆర్‌ఐ సెల్వం పాల్గొన్నారు.



వాకాడు: మాట్లాడుతున్న తహసీల్దార్

పంగుణోత్తర ఉత్సవాలు ప్రారంభం

- రోజూ అమ్మవారికి అభిషేకం, ఊంజల్‌సేవ
- చివరి రోజు అమ్మవారి సన్నిధిలో ఏకాంతసేవ



ఊంజల్‌సేవలో అమ్మవారు

నారాయణవనం: టీటీడీ అనుబంధంలోని ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు రోజుల పంగుణోత్తర ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం అమ్మవారికి ప్రత్యేక సర్కారు అభిషేకం, సాయంత్రం ఊంజల్‌సేవ జరుగుతాయని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తెలిపారు. అలాగే ప్రతిరోజూ శ్రీభోగశ్రీనివాసమూర్తికి ఏకాంతంగా శయనసేవను నిర్వహిస్తారు. ఉత్సవాల్లో చివరి రోజైన 25వ తేదీ రాత్రి అమ్మవారితో కలిసి స్వామికి శ్రీపద్మావతీ అమ్మవారి సన్నిధిలో ఏకాంత సేవ, మరుసటిరోజు మంగళవారం ఉదయం సుప్రభాతసేవ నిర్వహిస్తామని వారు తెలిపారు. అమృతం కోసం పాలకడలిని దేవదానవులు చిలకగా తమిళ పంగుణి నెల ఉత్తరా నక్షత్రం రోజున ఉద్భవించిన లక్ష్మీదేవిని మహావిష్ణువు వివాహమాడినట్లు ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. శ్రీపద్మావతీ అమ్మవారిని కల్యాణ వేంకటేశ్వరుడు వివాహమాడిన క్షేత్రమైన నారాయణవనంలో ఏటా తమిళ పంగుణి నెల ఉత్తరా నక్షత్రానికి ఆరు రోజుల నుంచి ఉత్సవాలను నిర్వహిస్తారు. తొలిరోజు మంగళవారం సుప్రభాతసేవతో నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. గంట, నైవేద్యం అనంతరం శ్రీపద్మావతీ అమ్మవారికి సర్కారు అభిషేకాన్ని నిర్వహించారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు పద్మావతీ అమ్మవారిని పట్టు పీతాంబరాలు, స్వర్ణాభరణాలను, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప చేశారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయలలో కొలువుదీరి ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దివ్యాంగులకు కృత్రిమ చేతులు అందిస్తాం

గూడూరురూరల్: చేతులు లేని దివ్యాంగులకు కృత్రిమ చేతులను అందించేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గూడూరు, పరిసర ప్రాంతాల్లోని చేతులు లేని వారి కోసం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మే 19 నుంచి 26 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని అందులో ఉచితంగా చేతులను అమర్చే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని అన్నారు. ఇందులో చేతులు కోల్పోయిన, పుట్టుకతో చేతులు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు పేర్ల నమోదుకు 7207403150 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కండలేరులో 8.652 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 8.652 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 500 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 115, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



టీహెచ్‌ఆర్ బ్యాగులను అందజేస్తున్న సీడీపీఓ

చిల్లకూరు: పోషక విలువలు ఉన్న ఆహారం క్రమం తప్పకుండా తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని గూడూరు ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ అన్నారు. స్థానిక శంకర గిరిజనకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషన్ పట్వాడ్ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ బ్యాగులను అందజేశారు. సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంద్రావతి, పెంచలమ్మ, కమలమ్మ, సుజాత, ప్రసన్న విజయమ్మ, అలేఖ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భాండాగారాలు



వీసీ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న అతిథులు, సిబ్బంది

తిరుపతి సిటీ: పౌర గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భాండాగారాలని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో భారత ప్రభుత్వ మంత్రిత్వశాఖ, జాతీయ గ్రంథాలయ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన 43వ సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆధునిక సాధనాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ప్రభుత్వం లైబ్రరీలను అప్‌గ్రేడ్ చేసి పౌరులకు అందుబాటులో ఉంచిందన్నారు. అనంతరం గ్రంథాలయాల డైరెక్టర్ జనరల్, అదనపు మిషన్ డైరెక్టర్ బీవీ శర్మ మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ మిషన్–2014లో జాతీయ నాలెడ్జ్ కమిషన్ సిఫారసు మేరకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రారంభించారన్నారు. నేషనల్ లైబ్రరీ మిషన్ ద్వారా మోడల్ లైబ్రరీలు, పబ్లిక్ లైబ్రరీలు ఆత్యాధునిక సదుపాయాలతో పాఠకుల కోసం ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వీసీని అతిథులు, నిర్వాహకులు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ ఓ.మహ్మద్ హుస్సేన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ దీపంజన్ చటర్జీ, లైబ్రేరియన్ ప్రొఫెసర్ సురేంద్ర బాబు, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి 60 మంది గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

–డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

దక్కిలి: ఉపాధి పనుల్లో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మార్లగుంట గ్రామంలో జరుగుతున్న మినీ అమృత్ సరోవర్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ 100 రోజులు పని దినాలు మార్చి నెలఖరులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు మండల వ్యాప్తంగా 1,850 కూలీలు తగ్గకుండా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం కూలీల మస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ దామోదర్‌రాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు షఫీ, గిరి, సరిత, బీఎఫ్‌టీ శివయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి

బాలాయపల్లి (దక్కిలి): ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలని పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వెంగమాంబపురంలో ఉపాధి హామీ కింద జరుగుతున్న నీటి కుంట పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఏపీఓ మృత్యుంజయరావు, ఈసీ కరుణాకర్‌రెడ్డి, టీఏలు మస్తానమ్మ, శ్రీనివాసులు, వెంకటయ్య, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.



వెంగమాంబపురంలో..

నాగలి కూడా ఆయుధమే పుస్తక పరిచయ సభ రేపు

తిరుపతి కల్చరల్: కొమ్మవరపు విల్సన్ రావు రచించిన కవితా సంపుటి నాగలి కూడా ఆయుధమే పుస్తకం పరిచయ సభ గురువారం సాయంత్రం 4.30 గంటలకు యూత్‌హాస్టల్లో నిర్వహిస్తున్నట్లు ఈతరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్వేత డైరెక్టర్ భూమన్, విశిష్టత అతిథిగా శ్రీపద్మావతీ మహిళా వర్సిటీ తెలుగు శాఖాధిపతి డాక్టర్ వై.సుభాషిణి హాజరవుతారని, అలాగే ఈ సందర్భంగా ఓఆర్‌ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ. వెంకటేశ్వర్లు హాజరై పుస్తక సమీక్ష చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహితీ వేత్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.